ప్రజాశక్తి
శనివారం 26 ఏప్రిల్ 2025
5
కర్నూలు

మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా

‘బోండం’తో డీహైడ్రేషన్ దూరం

- అదును చూసి ధర పెంచుతున్న వ్యాపారులు - కొబ్బరి బోండం ధర భరించలేకున్నాం : వినియోగదారులు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

వేసవి తాపం పెరుగుతోంది... దాహంతో అలమటిస్తున్నారా? అయితే మీకో చక్కని పరిష్కారం..! ఎండలు మండిపోతున్న ఈ సమయంలో, చల్లని కొబ్బరి బొండం కంటే ఆహ్లాదకరమైనది మరొకటి ఉండదు. ప్రతిసారీ మంచి, తియ్యటి కొబ్బరి నీరు దొరుకుతుందా..? కొన్నిసార్లు బొండం నిండా నీరు ఉండదు.. లేదా రుచి బాగోదు. రూ.70 ఎలా భరించాలి అంటున్నారు చాలా మంది వినియోగదారులు. ఈ వేసవిలో నాణ్యమైన కొబ్బరి బొండాలను సరసమైన ధరలకు అందిస్తున్నామని లాభాలు గడిస్తున్నారు వ్యాపారులు. వినియోగదారుల అసలైన సమస్యను పరిష్కరించడానికి నమ్మకాన్ని పొందడమే కాకుండా, స్థిరమైన ఆదాయాన్ని కూడా సంపాదిస్తున్నారు కొందరు. ఈ నేపథ్యంలో ప్రజాశక్తి ప్రత్యేక కథనం...

టెంకాయ పాలు అమతంతో సమానమని వైద్యులు సైతం చెబుతుంటారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారికి టెంకాయ పాలు తాగమని సూచిస్తుంటారు. ఒకప్పుడు అందుబాటు ధరలో ఉన్న టెంకాయ ఇప్పుడు సామాన్యుడికి భారంగా మారింది. ఒకప్పుడు రూ.20ఉన్న టెంకాయ ధర ప్రస్తుతం రూ.70కి చేరింది. వేసవి కాలంలో టెంకాయలకు విపరీతమైన డిమాండ్ ఉంటుంది. ఒక టెంకాయలో సుమారు 300 మిల్లీలీటర్ల నీరు ఉంటుంది. లీటరు టెంకాయ నీళ్లు అయితే రూ.200 పలుకుతోంది. తమిళనాడులోని మైసూరు ప్రాంతంలో టెంకాయ తోటలు ఎక్కువగా ఉండటంతో అక్కడి నుంచి వ్యాపారులు టెంకాయలను దిగుమతి చేసుకుని ఇక్కడ అమ్ముతుంటారు. ఐదుగురు లేదా ఆరుగురు కలిసి ఒక లారీ లోడు టెంకాయలు తెప్పించుకుని పంచుకుంటారు. ఎండలు ముదిరిన కొద్దీ వీటికి గిరాకీ పెరుగుతుంది. వేసవిలో డీహైడ్రేషన్, నీరసంతో బాధపడేవారికి టెంకాయ నీళ్లు సెలైన్ లాగా పనిచేసి త్వరగా కోలుకునేలా చేస్తాయి. కర్నూలు నగరంలో ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల వద్ద, ఎన్ఆర్.పేట, గడియారం ఆసుపత్రి, పూల బజార్, వన్ టౌన్, సి.క్యాంప్, చెన్నమ్మ సర్కిల్, బళ్లారి చౌరస్తా, కొత్త బస్టాండ్ వంటి ప్రధాన కూడళ్లలో, జనసందోహం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో టెంకాయలను విక్రయిస్తుంటారు. రోడ్డు పక్కన ఫుట్‌పాత్‌లపై, తోపుడు బండ్లపై వీటిని ఎక్కువగా అమ్ముతుంటారు. ఎలాంటి అద్దె లేకుండా వ్యాపారం చేసుకుంటూ లాభాలు గడిస్తుంటారు. హైదరాబాద్‌లో ఒక టెంకాయ రూ.35 ఉండగా, కర్నూలులో రూ.70 అమ్మడం గమనార్హం.

కొత్తబస్టాండ్‌కు చెందిన కొబ్బరి బోండాల వ్యాపారులు మల్లికార్జున, మొహమ్మద్ రఫీ మాట్లాడుతూ తాము మైసూరు నుండి టెంకాయలు తెప్పిస్తామని తెలిపారు. అక్కడ ఒక పచ్చి టెంకాయ రూ.55 పడుతుందని, రవాణా ఖర్చులు రూ.7 కలుపుకుంటే మొత్తం రూ.62 అవుతుందని చెప్పారు. తాము రిటైల్‌గా రూ.70కి అమ్ముతున్నామని తెలిపారు. ఒక లారీ సరుకును ఐదుగురు కలిసి తెచ్చుకుంటామని, ఒక్కొక్కరికి రూ.6,000 కాయలు వస్తాయని, వారం రోజుల్లో అమ్ముడైపోతాయని చెప్పారు. తమ షాపులో ఐదుగురు పనిచేస్తారని, చిల్లర సమస్య ఎక్కువగా ఉంటుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. నగరపాలక సంస్థకు సంవత్సరానికి రూ.600 పన్ను చెల్లిస్తామని, షాపు అద్దె రూ.10,000 ఉందని వారు తెలిపారు. సీజన్‌లో మాత్రమే గిరాకీ ఉంటుందని, వేసవిలో అద్దె కట్టడానికి ఇబ్బంది ఉండదని, వర్షాకాలం, శీతాకాలంలో కేవలం రోగులు మాత్రమే కొంటారని వారు వివరించారు. తమ వద్ద లీటరు టెంకాయ పాలు కొంటే ఒక బాటిల్ ఉచితంగా ఇస్తామని వారు ఆఫర్ ప్రకటించారు.

పచ్చి టెంకాయ నీళ్లు ఆరోగ్యానికి మంచిది

- జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి పి.ఖాజా హుస్సేన్

వేసవిలో టెంకాయ నీళ్లు తాగడం ఆరోగ్యానికి చాలా మంచిది. వేసవిని అదునుగా తీసుకుని వ్యాపారులు ధరలు పెంచి అమ్మడం వల్ల సామాన్య ప్రజలు కొనలేని పరిస్థితి ఏర్పడింది. వైద్యుల సూచన మేరకు రోగులు తప్పనిసరిగా తీసుకోవాల్సిందే. టెంకాయ నీళ్లు తాగడం వల్ల దాహం తీరుతుందని, శరీరం డీహైడ్రేట్ కాకుండా ఉంటుందని ఆయన తెలిపారు. టెంకాయ నీళ్లలో కార్బోహైడ్రేట్లు, ఎలక్ట్రోలైట్లు, మినరల్స్, ప్రోటీన్లు, విటమిన్ సి, బి, సైటోకైన్ లాంటివి ఉంటాయి. ఆరోగ్యానికి మంచిది. సామాన్య ప్రజలు వాటి బదులుగా తక్కువ ధరలో లభించే కళింగిరి, బెల్లం పానకం, చెరుకు రసం, మజ్జిగ లాంటివి తీసుకోవచ్చని ఆయన సూచించారు.

మాదకద్రవ్యాలను నియంత్రించాలి

- కలెక్టర్ పి.రంజిత్ బాష

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

జిల్లాలో మాదక ద్రవ్యాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నార్కోటిక్స్ కో ఆర్డినేషన్ సమావేశాన్ని నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే నష్టాల గురించి పాఠశాలలు, కళాశాలలు, యూనివర్సిటీల్లో విస్తృత ప్రచారం చేయాలని అధికారులను ఆదేశించారు. గంజాయి మొక్కలు తినిపిస్తే ఎద్దులకు బలం వస్తుందని పొలాల్లో సాగు చేస్తున్నట్లు తెలిసిందని ఎస్పి తెలుపగా, విలేజ్ అగ్రికల్చర్ అధికారులు, హార్టికల్చర్ అధికారులతో పొలాల్లో గంజాయి సాగుపై వెతికించాలని వ్యవసాయ శాఖ అధికారిని ఆదేశించారు. అటవీ శాఖ అధికారులు వారి పరిధిలోని అటవీ భూములు పరిశీలించి, గంజాయి సాగు కనిపిస్తే వెంటనే పోలీస్ అధికారులకు సమాచారం అందించాలన్నారు. ముఖ్యంగా అటవీ ప్రాంతానికి దగ్గరగా ఉండే గ్రామాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ ఆదేశించారు. వచ్చే విద్యా సంవత్సరం నుండి మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాల గురించి పాఠశాలల్లో వ్యాస రచన, వక్తృత్వ పోటీలు, ర్యాలీలు, ప్రతిజ్ఞల ద్వారా విద్యార్థులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని కలెక్టర్ డిఇఒ ఆదేశించారు. జిల్లా ఎస్పి విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ... మత్తు పదార్థాల వినియోగం, గంజాయి సాగు, అమ్మకం చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పోలీస్ శాఖ తో పాటు ఇతర శాఖల అధికారులు 11 మందితో ఒక కమిటీ ఏర్పాటు చేసి, మాదకద్రవ్యాల నియంత్రణకు పూర్తిస్థాయిలో చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్పీ పేర్కొన్నారు. సమావేశంలో జడ్‌పి సిఇఒ నాసర రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబు, డిటిసి శాంత కుమారి, ఎక్సైజ్ సూపరింటెండెంట్ సుధీర్ కుమార్, డిఎంహెచ్ఒ శాంతి కళ, జిల్లా విద్యాశాఖాధికారి శామ్యూల్ పాల్, ఆర్‌టిసి ఆర్ఎం శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉచిత ఆన్‌లైన్ శిక్షణ

జిల్లాలో 8 నుండి 12వ తరగతి విద్యార్థులకు ఉచిత ఆన్‌లైన్ శిక్షణ నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా యువజన సంక్షేమ శాఖ,సెట్కూరు అండ్ జిల్లా విద్యా శాఖ ఆధ్వర్యంలో 8 నుండి 12వ తరగతి విద్యార్థులకు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలోని వర్చువల్ స్టూడియోలో నిర్వహిస్తున్న ఉచిత ఆన్‌లైన్ మాస్టర్ క్లాస్ శిక్షణా తరగతులను జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఈ నెల 25 నుండి మే 28 వరకు నైపుణ్య ఐఎఎస్ కోచింగ్ అకాడమీ వారి సహకారం తో 8 వ తరగతి నుండి 12 వ తరగతి విద్యార్థుల కొరకు కెరీర్ గైడెన్స్, నైపుణ్య అభివృద్ధి శిక్షణ తరగతులను వర్చువల్ విధానం ద్వారా నిర్వహిస్తున్నామని తెలిపారు. విద్యార్థులు పై తరగతుల్లో ఏ సబ్జెక్టు ఎంచుకోవాలి, తమకు ఏది అనుగుణంగా ఉంటుంది అని విశ్లేషించుకోవడంతో పాటు జనరల్ నాలెడ్జ్, వివిధ అంశాల్లో నైపుణ్యం పొందేందుకు ఈ తరగతులు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. రాష్ట్రంలో తొలిసారిగా జిల్లాలో విద్యార్థులకు వర్చువల్ తరగతులు ప్రారంభించామని కలెక్టర్ గుర్తుచేశారు. వర్చువల్ తరగతుల నిర్వహణ ద్వారా జిల్లాలో హిందీ ఉపాధ్యాయుల కొరత ఉన్నప్పటికీ పదవ తరగతిలో హిందీ సబ్జెక్టులో 99 శాతం పాస్ అయ్యారని కలెక్టర్ తెలిపారు. పదో తరగతి ఫెయిల్ అయిన విద్యార్థులకు వర్చువల్ స్టూడియో ద్వారా సోమవారం నుంచి రెమిడియల్ తరగతులు, విషయ నిపుణులచే ఆన్‌లైన్‌లో బోధన నిర్వహిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. జిల్లా విద్యా శాఖాధికారి శామ్యూల్ పాల్ మాట్లాడుతూ ఉచిత ఆన్‌లైన్ శిక్షణ కు సంబంధించి లింక్ వివరాలు క్లాస్ టీచర్ ద్వారా విద్యార్థులకు షేర్ చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సెట్కూరు సిఇఒ డాక్టర్ వేణుగోపాల్, నైపుణ్య ఐఎఎస్ అకాడమీ చైర్మన్ కృష్ణ, విషయ నిపుణులు పాల్గొన్నారు.

పహల్గాం ఉగ్రదాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం

- కర్నూలు ఓల్డ్‌సిటీలో సిపిఎం నిరసన

ప్రజాశక్తి కర్నూలు కార్పొరేషన్

పహల్గాంలో అమాయక టూరిస్టులపై జరిగిన దారుణమైన ఉగ్రదాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎండి అంజిబాబు అన్నారు. శుక్రవారం కర్నూలు ఓల్డ్ సిటీలో, సిఎం ఓల్డ్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో నగర కార్యవర్గ సభ్యులు ఎస్ఎండి.షరీఫ్ అధ్యక్షతన పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద నిరసన తెలిపారు. జమ్మూ కాశ్మీర్ రాష్ట్రం అనంతనాగు జిల్లా సమీపంలోని పహల్గాంలో జరిగిన ఈ అమానుషమైన ఉగ్రదాడికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఎండి అంజిబాబు, సిపిఎం నగర కార్యదర్శి ఎం.రాజశేఖర్ మాట్లాడుతూ పహల్గాం ఉగ్రదాడిని ప్రజాస్వామ్యవాదులందరూ ఏకగ్రీవంగా ఖండించాలన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం గత మూడేళ్లుగా సైనిక నియామకాలు నిలిపివేసి, అగ్నివీర్ పేరుతో కాంట్రాక్ట్ పద్ధతిలో సైనికులను నియమించడం దేశ భద్రతపై బిజెపి పాలకుల చిత్తశుద్ధిని తెలియజేస్తోందని విమర్శించారు. భారతదేశంలో ఏ రాష్ట్రంలో ఎన్నికలు వచ్చినా ఇలాంటి ఘటనలు కొత్తకాదని, దీనిని సాకుగా చూపి ఎన్నికల్లో లబ్ధి పొందడానికి బిజెపి నేతలు సర్జికల్ దాడులకు పాల్పడటం పరిపాటిగా మారిందని వారు దుయ్యబట్టారు. గతంలో నరేంద్ర మోదీ పెద్ద నోట్ల రద్దు పేరుతో ఉగ్రవాదాన్ని అణిచివేస్తామని గొప్పలు చెప్పి, ఆ తర్వాత నల్లధనాన్ని వెలికి తీయడానికి నోట్ల రద్దు అని చెప్పారని, కానీ ఒక్క నల్ల కుబేరుడిని కూడా బయటకు తీయలేదని, ఉగ్రవాదాన్ని అంతం చేయలేదని విమర్శించారు. ఉగ్రవాదులు పర్యాటకులను మతం అడిగి చంపలేదని, ఎవరి ప్యాంటు విప్పి చూడలేదని, బిజెపి పాలకులు దీనికి మత రంగు పులిమి ముస్లింలపై దాడులు చేయాలని చూస్తే దేశ ప్రజలు సహించబోరని హెచ్చరించారు. ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా దానిని కూకటి వేళ్లతో పెకలించి వేయాలని కేంద్ర రక్షణ మంత్రికి, ప్రధాని నరేంద్ర మోదీకి వారు గుర్తు చేశారు. ఈ దేశంలో వక్ఫ్ సవరణ చట్టం తెచ్చి మైనార్టీ ప్రజల్లో వ్యతిరేకత తెచ్చుకున్న బిజెపి ప్రభుత్వం ఇలాంటి దాడులు చేయించి ఆ వ్యతిరేకతను పక్కదారి పట్టించే కుట్రలు గతంలోనూ చేసిందని అన్నారు. ఉగ్రవాదాన్ని కూకటి వేళ్లతో పెకలించడానికి అఖిలపక్ష పార్టీలన్నీ మద్దతునిచ్చాయని, దాని పేరుతో పాకిస్తాన్ దేశ ప్రజలపై, ఈ దేశ ముస్లింలపై యుద్ధం చేయడానికి కాదని వారు గుర్తు చేశారు. ఉగ్రదాడిలో మరణించిన ప్రతి కుటుంబానికి రూ.50 లక్షల పరిహారం, ఒక ఉద్యోగం ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. నగర కార్యదర్శి వర్గ సభ్యులు కె. రామకృష్ణ మాట్లాడుతూ ఇలాంటి విచక్షణారహిత దాడులకు పాల్పడిన ఉగ్రవాదులను ఏరివేయాలని, రక్షణ శాఖలో సైనిక నియామకాలను తక్షణమే చేపట్టాలని డిమాండ్ చేశారు. సిపిఎం నగర నాయకులు నాగస్వాములు, ఈశ్వర్, రాంబాబు, పార్వతయ్య, షేక్ష పాల్గొన్నారు.

నిరసననుద్దేశించి మాట్లాడుతున్న నాయకులు

రోడ్డు ప్రమాదాలు తగ్గించాలి

ప్రజాశక్తి కర్నూలు కలెక్టరేట్

జిల్లాలో రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా సంబంధిత అధికారులను ఆదేశించారు.. శుక్రవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్ లో ఎస్పి విక్రాంత్ పాటిల్ తో కలిసి జిల్లా కలెక్టర్ జిల్లా రోడ్ సేఫ్టీ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ రహదారుల్లో గుర్తించిన బ్లాక్ స్పాట్ లలో ప్రమాదాల నివారణకు వీలుగా తీసుకుంటున్న చర్యలపై క సంబంధిత అధికారులను ఆరా తీశారు. ఎల్లమ్మగుడి దగ్గర అప్రోచ్ రోడ్డు కొరకు భూసేకరణ చేసి ఇచ్చి నెల అవుతుందని, అప్రోచ్ రోడ్డు పనులు వెంటనే మొదలు పెట్టాలని కలెక్టర్ ఎన్‌హెచ్ అధికారులను ఆదేశించారు. పెద్దపాడు నుండి హైదరాబాద్ ఎన్‌హెచ్‌కు లింక్ చేస్తూ ఔటర్ రింగ్ రోడ్ ఏర్పాటుకు సంబంధించిన భూ సేకరణకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ కర్నూలు మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించారు.. ఔటర్ రింగ్ రోడ్ నిర్మాణం వల్ల ట్రాఫిక్ రద్దీ చాలా తగ్గుతుందని కలెక్టర్ తెలిపారు. బళ్ళారి చౌరస్తా వద్ద జంక్షన్ ఇంప్రూవ్‌మెంట్ పనులు పూర్తయ్యాయని అధికారులు తెలిపారు. ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఎంట్రన్స్, పార్కింగ్ ఏర్పాటు అంశాలపై వేగవంతంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ హాస్పిటల్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ను ఆదేశించారు. సమావేశంలో ఆర్ అండ్ బి ఎస్ఇ మహేశ్వర రెడ్డి, పంచాయతీ రాజ్ ఎస్ఇ రామచంద్రారెడ్డి, డిటిసి శాంతకుమారి, ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ ఎఒ సింధు సుబ్రమణ్యం, నేషనల్ హైవే పిడి లు, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాష

కోడుమూరులో మలేరియాపై అవగాహన ర్యాలీ

సమిష్టి కృషితో మలేరియా అంతం

ప్రపంచ మలేరియా నివారణ దినోత్సవం పై అవగాహన

ప్రజాశక్తి- కోడుమూరు రూరల్

కోడుమూరు కోలోకేటెడ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ శ్రీమంత్ మాదన్న ఆధ్వర్యంలో ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా కోడుమూరు పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారి మాట్లాడుతూ ఈ సంవత్సరం “మలేరియా అంతం మనతోనే” మరలా వనరులు చేకూర్చు! మరలా కొత్తగా ఆలోచించు! మరలా ఉత్తేజం పొందు! అను నినాదంతో పని చేస్తున్నామని అన్నారు. అందరిలో మార్పు వస్తే మలేరియా అంతం అవుతుందని తెలిపారు. ప్రపంచ మలేరియా నివారణ దినోత్సవం జరుపుకుంటున్నామని, ఆడ ఎనాఫిలస్ దోమకాటు ద్వారా మలేరియా జ్వరం వస్తుందని, చలి వణుకు తో కూడిన విపరీతమైన జ్వరం, తలనొప్పి, ఒళ్ళు నొప్పులు వికారం ,జ్వరం పెరిగి విపరీతమైన చెమట పట్టి తిరిగి తగ్గుముఖం పడుతుందని ఈ లక్షణాలు ఉన్న వెంటనే గ్రామంలో ఉన్న ఆరోగ్య కార్యకర్త దగ్గర రక్త పరీక్ష చేయించుకుని తగిన చికిత్స వీలైనంత త్వరలో తీసుకోవాలన్నారు. నివారణ చర్యలలో భాగంగా ఇంటి పరిసరాలలో పనికిరాని పడవేసిన తొట్లు, డబ్బాలు టైర్లు, కొబ్బరి చిప్పలు, మురికి కాలువలలో నీరు నిల్వ ఉండడం వల్ల దోమలు ఉత్పత్తి చెందునని అలాంటి వాటిని అందులో ఉన్న నీటిని ఎప్పటికప్పుడు తొలగించవలయునని తెలిపినారు. ప్రతి శుక్రవారం తప్పనిసరిగా ఫ్రైడే డ్రైడే పాటించి అన్ని నీటి నిల్వలను పాత్రలను శుభ్రపరిచి తిరిగి నింపుకోవాలన్నారు.

పొగాకు రైతులను ఆదుకోండి

ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, టిడిపి సీనియర్ నేత డి విష్ణువర్ధన్ రెడ్డి కలెక్టర్ కు వినతి

ప్రజాశక్తి కర్నూలు క్రైమ్

జిల్లాలోని పొగాకు రైతుల సమస్యలను పరిష్కరించి ఆదుకోవాలని ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, సీనియర్ టిడిపి నేత డి.విష్ణువర్ధన్ రెడ్డి, అన్నారు. శుక్రవారం వారు పొగాకు రైతులతో కలిసి జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ కర్నూలు మండలం ఉల్చాల, ఈ.తాండ్రపాడు, సి.బెళగల్ మండలంలోని చాలా గ్రామాల్లో పొగాకు బేల్లు రైతుల దగ్గర ఉండి పోవడంతో వర్షాలు పడుతుండడంతో అక్కడక్కడ వారు పండించిన పంట చెడిపోతుందని రైతులు తీవ్రంగా ఆవేదన చెందుతున్నారన్నారు. ఈ విషయాన్ని రైతులు తన దగ్గర ప్రస్తావించారని అన్నారు. 2023 నుండి 2024 వరకు కర్నూలు జిల్లాలో దాదాపుగా 67,000 ఎకరాలలో పొగాకు పంట సాగు చేశారన్నారు. రైతులని ప్రోత్సహించి సాగు చేయించిన కంపెనీలు ఇప్పుడు ముఖం చాటేసి రైతులను తీవ్రంగా ఇబ్బందికి గురి చేస్తున్నారన్నారు. ఒప్పందం చేసుకున్న అన్ని పొగాకు కంపెనీలు కూడా రైతుల దగ్గర నుండి పండించిన పొగాకు పంటను తక్షణమే కొనాలని, లేనియెడల రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఉందని, కర్నూలు జిల్లా కలెక్టర్ కు సమస్యను వివరించారు. కలెక్టర్ అన్ని కంపెనీల ప్రతినిధులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తానని తెలిపారు.

నర్సింగ్ విద్యార్థినిపై లైంగిక వేధింపులు

- నిందితులను కఠినంగా శిక్షించాలి
- పటిష్టమైన కమిటీ ఏర్పాటు చేయాలి - ఐద్వా డిమాండ్

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో నర్సింగ్ విద్యార్థినిపై జరిగిన లైంగిక వేధింపులను ఐద్వా జిల్లా కమిటీ తీవ్రంగా ఖండించింది. నిందితులను కఠినంగా శిక్షించాలని, విద్యార్థినికి రక్షణ కల్పించాలని ఐద్వా జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం నాయకులు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె. వెంకటేశ్వర్లుకు ఐద్వా జిల్లా నాయకులు పద్మ, పిఎస్. సుజాత, మహేశ్వరీ, సావిత్రిల ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు ఆయనకు మహిళా కార్మికులు, విద్యార్థినిలు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. ఆసుపత్రిలో పనిచేస్తున్న సెక్యూరిటీ గార్డు నెలల తరబడి విద్యార్థినిని వేధించడం దారుణమని వారు పేర్కొన్నారు. ఇది కంచే చేను మేసిన చందంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. బాధితురాలు స్థానికురాలు కాకపోవడంతో, ఆసుపత్రి అధికారులు సెక్యూరిటీని తొలగించి, కేసు నమోదు కాకుండా ప్రయత్నించారని వారు ఆరోపించారు. గతంలోనూ ఇలాంటి ఘటనలు జరిగాయని, వేధింపులు నిజమని తెలిసినా అధికారులు చర్యలు తీసుకోలేదని వారు గుర్తు చేశారు. సెక్యూరిటీ సూపర్వైజర్ ఒక మహిళా ఉద్యోగిని వేధించడం వల్ల ఆమె ఆత్మహత్యాయత్నం చేసిందని, వడ్డే పద్మావతి అనే మరో మహిళా గార్డు లైంగిక వేధింపులకు గురై ఆత్మహత్య చేసుకుంటే నిందితులను కాపాడే ప్రయత్నం జరిగిందని వారు ఆరోపించారు. ఏ1 ఏజెన్సీ సూపర్వైజర్లు మహిళా కార్మికులను తీవ్రంగా వేధిస్తున్నారని బహిరంగంగా చెబుతున్నా చర్యలు శూన్యమని, ఇది ఆసుపత్రిలో మహిళా కార్మికులకు రక్షణ లేదనడానికి నిదర్శనమని అన్నారు. ఇలాంటి పరిస్థితులు కొనసాగితే అనేక కుటుంబాలు ఛిన్నాభిన్నమవుతాయని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ, ఆసుపత్రి అధికారులు స్పందించి నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని, లైంగిక వేధింపులపై పటిష్టమైన కమిటీని ఏర్పాటు చేసి మహిళలకు రక్షణ కల్పించాలని వారు డిమాండ్ చేశారు. లేకపోతే మహిళలందరినీ సమీకరించి పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని వారు హెచ్చరించారు.

పర్యవేక్షణ అధికారికి వినతి ఇస్తున్న ఐద్వా నాయకులు

నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు

ప్రజాశక్తి- సి బెళగల్

వచ్చే ఖరీఫ్ సమీపిస్తున్నదని రైతులను, పంట సాగులను ఆసరా చేసుకొని నకిలీ విత్తనాలు అంటకడితే చర్యలు తప్పవని విత్తన దుకాణదారులకు హెచ్చరించారు. శుక్రవారం సిబెళగల్‌లో నాగసాయి, మన గ్రోమోర్, కిసాన్ మాల్ దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కాలం చెల్లిన విత్తనాలు స్టాకు నిల్వలున్నట్లు తనిఖీలు చేసి విత్తనాలు ల్యాబ్ పరీక్ష నిమిత్తం నమూనాలు సేకరించారు. ఈ సందర్భంగా నకిలీ విత్తనాలు అమ్మినా, స్టాకు నిల్వలు చేసుకున్నా తగు శిక్షలు అనుభవిస్తారని అన్నారు. ఎక్కడైతే విత్తనాలు కొనుగోలు చేస్తామో అక్కడ బిల్లులు పొంది భద్రపరచుకోవాలని రైతులకు సూచించారు. అంతేకాకుండా ఈ ఏడాది ప్రత్తి విత్తనాలు ప్రభుత్వం అందుబాటులోకి తెస్తుందని 475 గ్రాముల ప్యాకెట్ రూ.901 కే రైతు సేవా కేంద్రాలలో లభిస్తాయని అన్నారు.

‘పది’లో మెరిసిన ‘శ్రీ ఆదిత్య స్కూల్’ విద్యార్థులు

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన కల్లూరులోని శ్రీఆదిత్య విద్యా నిలయం విద్యార్థులను గురువారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పాఠశాల అధినేత బంది కె.వాసు దేవయ్య మాట్లాడారు. పి.పూజిత 591 మార్కులతో మొదటి స్థానం, జి.బింధు మాధవి 574 మార్కులతో ద్వితీయ, బి.కార్తీక్ 571 మర్కులతో తృతీయ, కె.దిలీప్, షాలిని 570 మార్కులు, కె.శివకోటేశ్వరప్ప 566, జి.సంతోష్ కుమార్ 564, జ్యోత్స్న 559, రెహాన 554 ఉత్తమ మార్కులతో పాటు 500 మార్కులకు పైగా 22 మంది సాధించారన్నారు. 92 శాతం ఫలితాలు సాధించిన విద్యార్థులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు వరలక్ష్మి, కోఆర్డినేటర్ సయ్యద్, అఫీఫ, ఉపాధ్యాయులు కవిత, పుణ్యవతి, ఫాజిమ, మహేంద్ర, జ్యోతి విద్యార్థులను అభినందించారు.

తక్కువ ధరకే బంగారం పేర టోకరా...

రూ.48 లక్షలతో నిందితుడు పరార్ -కర్నూలు టూ టౌన్ లో బాధితులు ఫిర్యాదు
నిందితుడు అరెస్టు, రూ.45.90 లక్షలు రికవరీ - మోసపోవద్దు ఎస్పి

ప్రజాశక్తి- కర్నూలు క్రైమ్

తక్కువ ధరకే కేజీ బంగారాన్ని ఇప్పించి అధిక లాభానికి అదే బంగారాన్ని అమ్మి సొమ్ము చేయిస్తానని నమ్మించి డబ్బుతో పరారైన నిందితున్ని జిల్లా ఎస్పి విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు అరెస్టు చేశామని కర్నూలు డిఎస్పి జె. బాబు ప్రసాద్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం విలేకరుల సమావేశాన్ని నిర్వహించిన ఆయన కేసుకు సంబంధించిన వివరాలను తెలిపారు. తెలంగాణ రాష్ట్రం, రంగారెడ్డి జిల్లా, హయత్ నగర్, విజయనగర్ కాలనీకి చెందిన రంగు నాగేష్ అలియాస్ నాగిరెడ్డి అనే వ్యక్తి హైదరాబాద్ లోని సనత్‌నగర్ లో నివాసం ఉంటున్న సంతోషమ్మను కలిసి తనకు రూ.30 లక్షలు ఇస్తే కేజీ బంగారాన్ని కొనిపెట్టి, అదే బంగారాన్ని రూ.30 లక్షల లాభంతో రూ.90 లక్షలకు అమ్మి పెడతానని హామీ ఇచ్చాడన్నారు. అతని మాటలు నమ్మిన సంతోషమ్మ ఆశ పడి కొద్ది రోజుల క్రితం తన సొంత ఇంటిని అమ్మగా వచ్చిన రూ.48.50 లక్షలను నిందితునికి ఇచ్చేందుకు సిద్ధమయ్యింది. ఒప్పందం ప్రకారం నిందితుడు నగేష్ తాను తెచ్చుకున్న అద్దె కారులో సంతోషమ్మ దంపతులను ఎక్కించుకొని కర్నూలు నగరంలోని సాయిబాబా ఆలయం వద్దకు తీసుకెళ్లి, అక్కడే వేచి ఉండమని చెప్పి వారు తెచ్చిన రూ.48.50 లక్షల డబ్బుతో కూడిన బ్యాగుతో కారులో పరారయ్యాడు. అసలు విషయం తెలుసుకున్న బాధితురాలు సంతోషమ్మ తన భర్తతో కలిసి ఈనెల 19న కర్నూలు రెండవ పట్టణం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సిఐ జివి నాగరాజరావు కేసు నమోదు చేసుకుని తన సిబ్బంది రవి మహేష్‌తో కలిసి నిందితుని కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఈ మేరకు సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి, ముద్దాయి ని హైదరాబాదు సిటిలో అదుపులోకి తీసుకున్నారు. అతని నుండి రూ.45.91 లక్షలు రికవరీ చేశామని తెలిపారు. ఎవరైనా తక్కువ ధరకు బంగారాన్ని ఇప్పిస్తామని చెప్పినా, ఇతర కారణాల వల్ల అధిక లాభం చేకూరుస్తామని చెప్పినా నమ్మి మోసపోవద్దన్నారు. ఎవరైనా అనుమానితులు ఉంటే దయచేసి పోలీసులకు సమాచారం ఇవ్వాలని జిల్లా ఎస్పి విక్రాంత్ పాటిల్ జిల్లా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో 2వ, 3వ పట్టణ సిఐలు నాగరాజరావు, శేషయ్య, హెడ్ కానిస్టేబుల్ శేఖర్, రవి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను ఎస్పిని కలిసిన డివిఎంసి సభ్యులు ఎం.మద్దులేటి

ప్రజాశక్తి కర్నూలు క్రైమ్

జిల్లా ఎస్సి, ఎస్‌టి మానిటరింగ్ కమిటీ సభ్యులుగా నూతనంగా ఎన్నికైన కర్నూలు మండలం ఉల్చాల గ్రామానికి చెందిన ఎం.మద్దులేటి శుక్రవారం జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషను, ఎస్పి విక్రాంత్ పాటిల్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. నియమితులయ్యారు. బడుగు వర్గాలకు సేవ చేస్తున్న నేపథ్యంలో ఆయనకు ప్రభుత్వం ఇటీవల ఎస్సీ ఎస్టీ ఎస్టీ కమిటీ సభ్యునిగా నియమించింది. ఆయన ఎన్నిక పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

మాట్లాడుతున్న తహశీల్దార్ రజినీకాంత్

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

- తహశీల్దార్ రజినీకాంత్, సిఐ అశోక్ కుమార్

ప్రజాశక్తి - కౌతాళం

తుంగభద్ర నదిలో ఇసుక రీచ్ నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలను అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని తహశీల్దార్ రజినీకాంత్, సిఐ అశోక్ కుమార్ హెచ్చరించారు. శుక్రవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో నిర్వాహకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రజలకు ఉచితంగా ఇసుక అందించాలని తెలిపారు. ఇసుక రీచ్‌లో ఇష్టానుసారంగా వ్యవహరిస్తే నిర్వాహకులపై శాఖపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ప్రభుత్వ నిబంధన ప్రకారం సచివాలయాల్లో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు మాత్రమే సకాలంలో ఇసుకను అందించాలన్నారు. ఇసుక రీచ్ వద్ద అదనంగా డబ్బులు వసూలు చేస్తే, నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను తరలిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఆర్ఐ లక్ష్మణ్, విఆర్‌ఓలు పాల్గొన్నారు.

ఇకపై ప్రతి శుక్రవారమూ గ్రీవెన్స్

- టిడిపి ఇన్‌ఛార్జి రాఘవేంద్ర రెడ్డి


వినతులు స్వీకరిస్తున్న రాఘవేంద్ర రెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

టిడిపి జాతీయ అధ్యక్షులు, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు అన్ని నియోజక వర్గాల్లోనూ ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జ్‌లు ప్రతి బుధవారం నిర్వహించే గ్రీవెన్స్‌ను ఇకపై శుక్రవారానికి మార్చినట్లు, ఇకపై ప్రతి శుక్రవారం సమస్యల పరిష్కార వేదిక ద్వారా వినతులు స్వీకరిస్తున్నట్లు టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ ఎన్.రాఘవేంద్ర రెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని మాధవరం గ్రామంలోని ఇన్‌ఛార్జ్ కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం సృష్టించిన రెవెన్యూ సమస్యల వల్లే ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. భూ సంబంధిత సమస్యల వల్ల రెవెన్యూ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారనే సమాచారం అందిందని, వీలైనంత త్వరగా రెవెన్యూ సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఇతర కార్యాలయాల్లో ఉన్న ఇబ్బందులను ఫోన్ ద్వారా పరిష్కరించారు. పరిష్కరించిన సమస్యల సంఖ్యను తదుపరి వారం నివేదికను టిడిపి కేంద్ర కార్యాలయానికి తెలియజేస్తామని పేర్కొన్నారు.

స్లూయిజ్ ఏర్పాటు చేసి సాగునీరందించాలి

- రైతు సంఘం ఆధ్వర్యంలో సంతకాల సేకరణ

ప్రజాశక్తి- దేవనకొండ

మండలంలోని గుండ్లకొండ శివారులో ఉన్న హంద్రీనీవా కాలువకు స్లూయిజ్ ఏర్పాటు చేసి సాగునీరు ఇచ్చి రైతులను ఆదుకోవాలని ఎపి రైతు సంఘం మండల కార్యదర్శి కోటకొండ సూరి డిమాండ్ చేశారు. శుక్రవారం గుడిమరాళ్ల గ్రామంలో రైతుసంఘం ఆధ్వర్యంలో సాగునీరు అందించాలని సంతకాల సేకరణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గుండ్లకొండ దగ్గర స్లూయిజ్ ఏర్పాటు చేసి కోటకొండ వరకు పొలాలకు సాగునీరు అందించాలని కోరారు. భానుకుంట చెరువు, గుడిమిరాళ్ల, నిమ్మలబండ, తుమ్మలచెరువు, బంటుపల్లి, అనుకుంట చెరువు, చెల్లెల చెలిమిల, బండపల్లి, కోటకొండ చిన్నోని, మాచాపురం చెరువుకు హంద్రీనీవా ద్వారా నీటిని నింపాలని తెలిపారు. కృష్ణ, కౌలుట్ల, రామాంజనేయులు, ప్రభాకర్, అనిల్ కుమార్, రైతులు పాల్గొన్నారు.

గుడిమిరాళ్లలో సంతకాలు సేకరిస్తున్న రైతు సంఘం నాయకులు

ఉపాధి నిర్వీర్యం..!

- ఆకలి తీర్చని చట్టం
- ఉపాధి కూలీలకు వసతి కరువు..!
- అధికారుల నిర్లక్ష్యం

ప్రజాశక్తి - నందవరం

ఉపాధి హామీ చట్టం నిర్వీర్యమవుతోంది. పేదల సంక్షేమం, వలసలను నివారించడానికి కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టింది. ఉపాధి హామీ చట్టం ద్వారా కుటుంబాలను పోషించుకోలేమని కూలీలు ఆవేదన చెందుతున్నారు. కూలీల కోసం వసతులు కల్పించాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

పేదల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉపాధి హామీ చట్టం పేదల ఆకలి తీర్చడం లేదు. కష్టపడి పని చేసినా శ్రమకు తగిన వేతనాలు రావడం లేదు. ప్రభుత్వం ప్రకటించిన రూ.300 కూడా వేతనం రావడం లేదు. పనికి తగిన వేతనాలు రాకపోవడంతో ఉపాధి హామీపై కూలీలకు నమ్మకం సన్నగిల్లి వలసలు పెరుగుతున్నాయి. గతంలో ఉపాధి చట్టం ప్రారంభమైనప్పుడు ప్రజలు ఉపాధి వైపు మొగ్గు చూపేవారు. ప్రస్తుతం ఉపాధి హామీ పని అంటేనే ప్రజలు విముఖత చూపిస్తున్నారు. రోజూ కనీస వేతనం రూ.400 ఇవ్వాలని కూలీలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. పని ప్రదేశంలో కూలీలకు మౌలిక సదుపాయాలను కల్పించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. గతనెలలో జరిగిన ఉపాధి హామీ తనిఖీలో కూలీలకు మౌలిక సదుపాయాలు కచ్చితంగా కల్పించాలని నందవరం అధికారులను పీడీ ఆదేశించారు. వారి మాట కూడా నందవరం అధికారులు పట్టించుకోకుండా కూలీలను నిర్లక్ష్యం చేస్తున్నారు.

ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

కూలీలకు వసతి కరువు

- చాకలి శంకర్, నందవరం

ఉపాధి హామీ పనులు ప్రారంభమైనప్పుడు కూలీల సంక్షేమం, కూలీలు సేద తీరడానికి టెంట్లు, తాగునీరు అందించడానికి ప్రత్యేకంగా కొంత మంది వ్యక్తులను నియమించేవారు. పనులు జరుగుతున్న సమయంలో కూలీలు ప్రమాదానికి గురైతే ప్రథమ చికిత్స చేయడానికి వైద్య కిట్లు అందుబాటులో ఉంచేవారు. పని ముట్లు, మజ్జిగ సరఫరా చేసేవారు. ప్రస్తుతం కూలీలకు ఆ వసతులు కరువయ్యాయి. వెంట తెచ్చుకున్న నీరు సరిపోక దాహంతో ఇబ్బంది పడుతున్నాం. ప్రస్తుతం పొలాల్లో సేద తీరడానికి చెట్లు కూడా కనిపించడం లేదు. భగభగ మండే ఎండలో సేద తీరడానికి నీడ లేక, తాగడానికి నీరు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. అధికారులు మౌలిక సదుపాయాలు కల్పించి మమ్మల్ని ఆదుకోవాలి.

మౌలిక సదుపాయాల కల్పనకు నిధులు రావడం లేదు

- ఏపీవో శ్రీనివాసులు

కూలీలకు మౌలిక సదుపాయాలు కల్పించడానికి ప్రస్తుతం ప్రభుత్వం నుంచి నిధులు రావడం లేదు. కూలీలకు మౌలిక సదుపాయాలు కల్పించలేకపోతున్నాం. కూలీలు వడదెబ్బ బారిన పడకుండా ఉదయం 10 గంటలకే ఇంటికి చేరే విధంగా జాగ్రత్తలు తీసుకుంటున్నాం.

కౌతాళం కెజిబివిలో విద్యా కుసుమాలు

ప్రజాశక్తి - కౌతాళం

పదో తరగతి ఫలితాల్లో కౌతాళం కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలలో విద్యా కుసుమాలు వికసించాయి. శుక్రవారం ప్రిన్సిపల్ పుష్పలత మాట్లాడుతూ... పాఠశాలలో 36 మంది విద్యార్థినులు పరీక్షలు రాయగా 28 మంది ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. ఇందులో ఎం.రక్షిత 558 మార్కులతో మొదటి స్థానం, ఇందు 532 మార్కులతో ద్వితీయ స్థానంలో నిలిచినట్లు చెప్పారు. మంచి మార్కులు సాధించిన విద్యార్థినులకు అభినందనలు తెలుపుతూ, ఎక్కువ మంది పిల్లలు ఉత్తీర్ణత సాధించడానికి కృషి చేసిన ఉపాధ్యాయుల బృందానికి కృతజ్ఞతలు తెలిపారు.

30న బసవ జయంతిని జయప్రదం చేయండి

- రాష్ట్ర వీరశైవ లింగాయత్ బీసీ సెల్ కన్వీనర్ రుద్ర గౌడ్

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఈనెల 30న జరగబోయే బసవ జయంతిని జయప్రదం చేయాలని రాష్ట్ర వీరశైవ లింగాయత్, వైసిపి బీసీ సెల్ కన్వీనర్ వై.రుద్ర గౌడ్, వీరశైవ లింగాయత్ కమ్యూనిటీ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు బీసీ.నాగరాజు కోరారు. శుక్రవారం పట్టణంలోని రుద్ర గౌడ్ నివాసంలో బసవ జయంతి కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రుద్రగౌడ్, బీసీ.నాగరాజు మాట్లాడారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లోని వీరశైవ లింగాయత్‌లు కలిసి రుద్రాభిషేకం, బసవేశ్వరుడి చిత్ర పటం ఊరేగింపు కార్యక్రమంలో పాల్గొని బసవ జయంతిని జయప్రదం చేయాలని కోరారు. వీరశైవ సమితి నందవరం కన్వీనర్ శివప్ప గౌడ్, కార్యకర్తలు బసవరాజు, గురుస్వామి, రామలింగప్ప పాల్గొన్నారు.

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న రుద్ర గౌడ్

మెరుగైన ఫలితాలతో ఉన్నత శిఖరాలు

- తెలుగు రైతు జిల్లా ప్రధాన కార్యదర్శి సాయిబాబు

ప్రజాశక్తి - ఆదోని

అంది వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకొని విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని తెలుగు రైతు జిల్లా ప్రధాన కార్యదర్శి, దూదేకుల సంఘం నాయకులు సాయిబాబు ఆకాంక్షించారు. పదో తరగతిలో ఆదోని టాపర్‌గా నిలిచిన సలీమాను శుక్రవారం శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో పదో తరగతి టాప్ స్థానం సాధించిన సలీమా మరింతగా రాణించాలని ఆకాంక్షించారు. ఆదోని కిడ్డీస్ స్కూల్‌లో విద్యాభ్యాసం చేసిన సలీమా 597 మార్కులు సాధించి ప్రతిభను చాటారని తెలిపారు. ఈ విజయం వెనుక తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ప్రోత్సాహం ఎంతో కీలకమని విద్యార్థిని సలీమా పేర్కొనడం అభినందనీయమన్నారు. నాయకులు షేక్షావలీ, బదినేహల్ మాబుసా, రంజాన్ బాష ఉన్నారు.

సలీమాను సన్మానిస్తున్న సాయిబాబు

'పది'లో కవలల ప్రతిభ

ప్రజాశక్తి - కౌతాళం

ఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాల్లో కౌతాళం గ్రామానికి చెందిన చెందిన కె.లక్ష్మణాచారి, పుష్ప దంపతుల కవల పిల్లలు మంచి మార్కులతో ప్రతిభ చాటారు. కె.సాయిభరత్ ఆదోని పట్టణంలోని అక్షరశ్రీలో చదువుతూ 561 మార్కులు, కె.సాయి భార్గవ్ స్థానిక ప్రతిభ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో చదువుతూ 517 మార్కులు సాధించి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకొచ్చారు. ఒకే కుటుంబంలో ఇద్దరు కవల పిల్లలు 500కు పైగా మార్కులు తీసుకురావడంతో శుక్రవారం గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. స్నేహితులు, బంధుమిత్రులు అభినందిస్తున్నారు.

ముక్కన్న కుటుంబానికి అండగా ఉంటాం

- టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ రాఘవేంద్ర రెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

టిడిపి కార్యకర్త ముక్కన్న కుటుంబానికి అండగా ఉంటామని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ ఎన్.రాఘవేంద్ర రెడ్డి భరోసా ఇచ్చారు. శుక్రవారం మండలంలోని మాధవరం గ్రామ టిడిపి కార్యకర్త ఇరుపన్న గారి ముక్కన్న గుండె పోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న రాఘవేంద్ర రెడ్డి ముక్కన్న మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి రామిరెడ్డి కుటుంబం, టిడిపి కుటుంబం ఎప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు.

ఉగ్రదాడి దారుణం

- యుటిఎఫ్ జిల్లా కార్యదర్శులు గుమ్మల బాబు, కౌలన్న

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

జమ్మూ కాశ్మీర్‌లోని పెహల్గాం పర్యాటక ప్రాంతంలో కుటుంబ సభ్యులతో ఆనందంగా గడుపుతున్న పర్యాటకులపై విచక్షణ రహితంగా కాల్పులు జరిపి 28 మందిని పొట్టన పెట్టుకున్నారని, ఈ దాడులు దారుణమని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శులు గుమ్మల బాబు, కౌలన్న, రాష్ట్ర కౌన్సిలర్ ఎల్లప్ప, సిఐటియు నాయకులు గోవిందు, రాముడు విమర్శించారు. శుక్రవారం స్థానిక సోమప్ప సర్కిల్‌లో కొవ్వొత్తులు వెలిగించి దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి సంతాపం తెలిపారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. దేశ ప్రజలు కులాలు, మతాలు, ప్రాంతాలకు అతీతంగా ఈ చర్యలను ఖండించాలని, దేశ ప్రజలంతా ఒక తాటిపైకి వచ్చి ఉగ్రవాదాన్ని ఎదుర్కోవాలని కోరారు. యుటిఎఫ్ నాయకులు మద్రి రాజు, లక్ష్మన్న, చంద్రపాల్, ఎస్.సుధాకర్, ప్రశాంత్, భూపాల్, నారాయణ, శాంతిరాజు, శంకర్ నాయక్, శంకరయ్య, సుధాకర్, భాగ్యరాజు, నరసింహ, దేవపాల్, లతీఫ్, ఖాజన్న, కె.రాజు, తిరుపాల్, ఆంజనేయులు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ముస్లింల మౌన ప్రదర్శన

జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గాం వద్ద ఉగ్ర ముష్కరుల ఆటవిక ఉగ్ర దాడి అమానుషమని మస్జీద్-ఎ-హాఫిజ్ (మార్కజ్) కమిటీ సభ్యులు యూసుఫ్ మౌలానా, ఇమ్రాన్ మౌలానా విమర్శించారు. ఉగ్ర దాడిని నిరసిస్తూ మస్జీద్-ఎ-హాఫిజ్ కమిటీ ఆధ్వర్యంలో మౌనం పాటించారు. ఉగ్ర ముష్కరులను శిక్షించాలని, ముస్లింలు, హిందువులు భాయ్.. భాయ్.. అంటూ నినాదాలు చేశారు. ఈ ఉగ్ర దాడిలో మృతి చెందిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నామని, వారి కుటుంబాలకు అండగా ఉంటామని, దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కమిటీ సభ్యులు సయ్యద్ చాంద్, ఫారుక్, అల్తాఫ్, మెకానిక్ బాషా పాల్గొన్నారు. **హొళగుంద** మండలం గజ్జహళ్లి గ్రామానికి చెందిన కూటమి నాయకులు, ప్రజలు స్థానిక బస్టాండ్ దగ్గర కొవ్వొత్తులతో ర్యాలీ చేపట్టారు. సర్పంచి తనయుడు గిరిమల్ల మాట్లాడుతూ... గ్రామీణ ప్రాంతాల్లో కులం, మతం మరచి హిందూ ముస్లింలు సోదర భావంతో కలిసిమెలిసి జీవిస్తున్నారని తెలిపారు. చాకలి రామలింగ మాట్లాడుతూ... ఇది పర్యాటకులపై జరిగిన దాడి కాదని, దేశంపై జరిగిన దాడి అని తెలిపారు. ఉమేష్ పూజారి మాట్లాడుతూ... పహల్గాంలో భారతీయులపై జరిపిన ఉగ్రదాడుల్లో మృతి చెందిన 28 మందికి నివాళులర్పించారు.

నందవరం : జమ్ము కాశ్మీర్‌లో జరిగిన ఉగ్రదాడిని నిరసిస్తూ నందవరం గ్రామంలో గ్రామస్తులు శుక్రవారం కొవ్వొత్తులతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని నందవరం బీసీ కాలనీ నుంచి బస్టాండ్ వరకు నిర్వహించారు. అలాగే వ్యాపారులు, ఆటో యూనియన్ వారు స్వచ్ఛందంగా బంద్‌ను నిర్వహించారు.

ఎమ్మిగనూరులో మౌన ప్రదర్శన చేస్తున్న ముస్లింలు

ఎమ్మిగనూరులో యుటిఎఫ్ కొవ్వొత్తుల ప్రదర్శన

హొళగుందలో కొవ్వొత్తుల ర్యాలీ

నందవరంలో

నైపుణ్య ప్రదర్శనకు వేదిక.. టోర్నమెంట్లు

- 27 నుంచి ఫ్రెండ్ షిప్ కప్ క్రికెట్ టోర్నమెంట్

- ఆదోని క్రికెట్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు ముజీబ్ అహ్మద్

ప్రజాశక్తి - ఆదోని

క్రీడాకారుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని ప్రదర్శించుకునేందుకు టోర్నమెంట్లు వేదికగా మారుతాయని, అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆదోని క్రికెట్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు, ఫ్రెండ్ షిప్ కప్ క్రికెట్ టోర్నమెంట్ ఆర్గనైజర్ ముజీబ్ అహ్మద్ తెలిపారు. శుక్రవారం వారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నాయకులు మల్లికార్జునతో కలిసి మాట్లాడారు. ఆదోనిలో క్రికెట్ క్రీడాకారుల విజ్ఞప్తి మేరకు ప్రతేడాది రెండుసార్లు టోర్నమెంట్లు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇక్కడ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయిలో క్రికెట్ ఆడిన ఘనత ఆదోని క్రీడాకారులకు ఉందన్నారు. ఈనెల 27 నుంచి మే 3 వరకు ఫ్రెండ్ షిప్ కప్ క్రికెట్ టోర్నమెంట్ పట్టణంలోని మున్సిపల్ మైదానంలో నిర్వహిస్తున్నటఉల తెలిపారు. రాజకీయ పార్టీలు, ఇతర అసోసియేషన్లు, ఉద్యోగ, కార్మిక సంఘాలకు సంబంధించిన వారు టోర్నమెంట్‌లో ఆడతారని చెప్పారు. నియోజకవర్గానికి సంబంధించిన 16 జట్లు పేర్లు నమోదు చేసుకున్నాయని తెలిపారు. చివరి రోజు ఆదోని ఫ్రెండ్ షిప్ కప్‌తో పాటు బహుమతులు అందజేస్తామన్నారు. క్రీడాకారులు సమన్వయం పాటించి సహకరించాలని కోరారు.

17వ డాక్టోరల్ థీసిస్ కాన్ఫరెన్స్‌కు బండారి ధనుంజయ

ప్రజాశక్తి - దేవనకొండ

మండలంలోని పొట్లపాడు గ్రామానికి చెందిన బండారి ధనుంజయ కడప జిల్లాలోని యోగివేమన యూనివర్సిటీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎకనామిక్స్ విభాగంలో ప్రొఫెసర్ శ్రీనివాసులు బైనేని దగ్గర దేశంలోని గ్రామాల్లో ఉపాధి పెరుగుదల అనే అంశంపై పిహెచ్‌డి రీసెర్చ్ చేస్తున్నారు. హైదరాబాద్‌లోని ఇక్ఫాయ్ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ సోషల్ సైన్సెస్, ముంబయి ఇందిరా గాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డెవలప్‌మెంట్ రీసెర్చ్ ఆధ్వర్యంలో ఈనెల 22, 23న జరిగే 17వ డాక్టోరల్ థీసిస్ కాన్ఫరెన్స్‌కు ధనుంజయ ఎంపికయ్యారు. ఈ సమావేశానికి దేశ, విదేశాల్లో, రిజర్వ్ బ్యాంక్, ప్రపంచ బ్యాంకు వంటి సంస్థల నుంచి ఎకనామిస్టులు, ప్రొఫెసర్లు, నిపుణులు పాల్గొననున్నారు. ఈ సమావేశాల్లో బండారి బండారి ధనుంజయ 'ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రెవెన్యూ ఆదాయం, వ్యయం, మూలధన ఆదాయం, వ్యయం, వాటి లోటు సమస్యలపై ఆర్థిక క్రమశిక్షణ ఎలా' అనే అంశంపై ప్రసంగించనున్నారు. ధనుంజయ ఎంపిక కావడం పట్ల డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎకనామిక్స్, గ్రామస్తులు, స్నేహితులు శుక్రవారం హర్షం వ్యక్తం చేశారు.

రూ.80 లక్షల పన్ను బకాయిలు

- పెండింగ్ బకాయిలు వసూలు చేయండి

- మున్సిపల్ కౌన్సిల్‌లో దయాసాగర్

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

సమావేశం నిర్వహిస్తున్న కమిషనర్

ప్రభుత్వ కార్యాలయాల (పోస్టాఫీస్, పోలీస్ స్టేషన్, తహశీల్దార్ కార్యాలయం) నుంచి రూ.80 లక్షల పన్ను బకాయిలు మున్సిపాలిటీకి ఉన్నాయని, వీటిని వసూలు చేయడానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని టిడిపి మున్సిపల్ కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ దయాసాగర్ కోరారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాలులో సాధారణ కౌన్సిల్ సమావేశం మున్సిపల్ ఛైర్మన్ డాక్టర్ రఘు అధ్యక్షతన జరిగింది. ముందుగా ఉగ్ర దాడులను నిరసిస్తూ మున్సిపల్ వైస్ ఛైర్మన్ నజీర్ అహ్మద్, టిడిపి ఫ్లోర్ లీడర్ దయాసాగర్ సంతాపం వ్యక్తం చేశారు. మొత్తం 30 అంశాలను ఆమోదించారు. ఇందులో కూడా సంస్థ నిరాకరించిన భవనాల నిర్మాణాల నిలిపివేతలను కొనసాగించడానికి అనుమతులు ఇస్తున్నట్లు కౌన్సిల్ తీర్మానం చేసింది. అనంతరం దయాసాగర్ మాట్లాడారు. ఎమ్మిగనూరు మున్సిపాలిటీకి ఏడాది ఆదాయం రూ.12 కోట్లు వస్తోందని, ఈ జనరల్ నిధులను కమిషనర్ డ్రా చేసుకునే అధికారాన్ని ఆర్థిక శాఖ జిఒ (ప్రభుత్వం) ఇచ్చిందని చెప్పారు. 15వ ఫైనాన్స్ నిధులు 2021 నుంచి 2026 వరకు రూ.17 కోట్లు వచ్చాయని, ఇప్పటి వరకు కేవలం రూ.5 కోట్లు మాత్రమే ఖర్చు చేశారని తెలిపారు. మిగిలిన రూ.12 కోట్లతో పాటు స్వచ్ఛ భారత్ నిధులు, ఇతర పథకాల నిధులతో ఏడాదిలోపు బీవీ సహకారంతో అభివృద్ధి జరుగుతుందని చెప్పారు. ఏప్రిల్ 16న ఎల్ఎల్‌సి నీరు నిలుపుదల చేస్తారని, పట్టణానికి తాగునీటి ఇబ్బందులు లేకుండా చెరువులో నీటిని నిల్వ చేశారని తెలిపారు. ఈ నీరు మే ఆఖరి వరకు సరిపోతాయని, ఆ తర్వాత పులికనుమ ప్రాజెక్టు నుంచి 0.7 టిఎంసిలను వాడుకోవచ్చని చెప్పారు. ఇందులో రెండు సార్లు దశలవారీగా నీటిని వాడుకున్నా.. ఇంకా 0.6 టిఎంసిల నీరు ఉంటుందని తెలిపారు. ఎమ్మిగనూరు మున్సిపాలిటీ పన్నులు వసూలు చేయడంలో చాలా వెనకబడి ఉందని, రాష్ట్రంలో ఇంటి పన్నుల వసూలులో 30వ స్థానం, నీటి పన్నుల వసూలులో 9వ స్థానంలో ఉందని చెప్పారు. ఇది చాలా బాధాకరమని, ఇందుకు ప్రజలు కారణం కాదని, ప్రజలు బాగానే పన్నులు కడుతున్నారని తెలిపారు. ప్రభుత్వ భవనాలు, కార్యాలయాలు పన్నులు కట్టడం లేదని, పోస్టాఫీసు రూ.30 లక్షలు, ఎంపిడిఒ కార్యాలయం రూ.9 లక్షలు, పోలీసు స్టేషన్ రూ.28 లక్షలు, తహశీల్దార్ రూ.25 లక్షలతో పాటు ఇతర ప్రభుత్వ కార్యాలయాలు కూడా పన్నులు కట్టలేదని చెప్పారు. మున్సిపల్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించి పన్నులు వసూలు చేసి అభివృద్ధికి పాటుపడాలని తెలిపారు. కమిషనర్ గంగిరెడ్డి, కౌన్సిలర్లు రాందాస్ గౌడ్, ఇసాక్, అమాన్, నాగేశప్ప, బోయ బజారి, వహీద్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న దయాసాగర్

సెలవులొచ్చాయి.. జాగ్రత్తలు అవసరం...

- పిల్లలపై తల్లిదండ్రులు నిఘా పెట్టాలి
- వాగులు, వంకలు, బావులు దగ్గరకు వెళ్లకుండా చూసుకోవాలి
- తల్లిదండ్రులకు సూచిస్తున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి - చిప్పగిరి

చదువులు ముగిశాయి.. ఇక సెలవుల్లో ఆడిందే ఆట.. పాడిందే పాట అని విద్యార్థులు చాలా సంబర పడిపోతుంటారు. అన్ని సమయాలు మనకు అనుకూలంగా ఉండవు. జాగ్రత్తగా ఉండాలని ఉపాధ్యాయులు సూచిస్తున్నారు. విద్యార్థులపై నిఘా పెట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులకు కొన్ని సూచనలు చేస్తున్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో చదువుకుంటున్న విద్యార్థులు ఒక గుంపుగా ఏర్పడి ఎక్కడ పడితే అక్కడ తిరుగుతూ తల్లిదండ్రులకు తెలియకుండా వెళ్తుంటారు. ప్రతి తల్లిదండ్రులూ తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. పిల్లలకు ఏదైనా జరిగితే వారి జీవితకాలం మనోవేదన చెందుతారు. వారితో పాటు వారి తల్లిదండ్రులు కూడా అదే మనోవేదన గురి కావాల్సి వస్తుంది. ముందు జాగ్రత్తగా పిల్లలు ఎక్కడికి వెళ్తున్నారు, ఏం చేస్తున్నారనే దానిపై పూర్తి నిఘా పెంచే బాధ్యత తల్లిదండ్రులపై ఉంది. పాఠశాలలో చదువుకుంటున్న వరకు పిల్లలపై సర్వహక్కులు ఉపాధ్యాయులకు ఉంటాయని ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. విద్యార్థులు చాలా వరకు సెలవుల్లో వాగులు, వంకలు, బావుల్లో ఎవరూ ఎక్కువగా ఈత కొట్టుకుంటూ.. ఎంత దూరం వెళ్తున్నామని పందేలు కాస్తుంటారు. ఇది చాలా ప్రమాదకరమని తల్లిదండ్రులు తెలుసుకోవాలి. అలాగే చెట్లు ఎక్కడం.. తేనె ఉందని వెళ్లడం ప్రమాదకరమని తెలిసినా అలాగే చేస్తుంటారు. సెలవుల్లో చాలా సంఘటనలు జరిగి తల్లిదండ్రులకు శోకం మిగిల్చిన సంఘటనలు చూస్తూనే ఉన్నాం. పెద్దలు లేకుండా విహార యాత్రలకు వెళ్లడం కూడా మంచిది కాదని పిల్లల తల్లిదండ్రులు తెలుసుకోవాలి. ఇంటిలోని ద్విచక్ర వాహనం తీసుకొని ఎక్కడపడితే అక్కడ తిరగడం కూడా మంచిది కాదని ఉపాధ్యాయులు కోరుతున్నారు. ముందు జాగ్రత్తలతో సెలవులు అయిపోయే వరకు తగిన సూచనలు ఇచ్చి వారిపై గట్టి నిఘా ఉంచి చూసుకోవాలని తల్లిదండ్రులను ఉపాధ్యాయులు కోరుతున్నారు. ముఖ్యంగా విద్యార్థులు సెలవుల్లో ఏదైనా శిక్షణా తరగతులకు వెళ్లేలా చేస్తే మరి బాగుంటుందని తల్లిదండ్రులకు తెలుపుతున్నారు.

బావిలో ఈత కొడుతున్న విద్యార్థులు

విద్యార్థులపై ఒక కంట కనిపెడుతూనే ఉండాలి

- రంగ నాయకులు, ఉపాధ్యాయులు, చిప్పగిరి

విద్యార్థులు ఎక్కడికి వెళ్తున్నారు. ఏం చేస్తున్నారనేది తల్లిదండ్రులు ఒక కంట కనిపెడుతూనే ఉండాలి. పాఠశాలలో చదువుకునే రోజులన్నీ కూడా మా పరిధిలో ఉంటాయి. విద్యార్థులు మేము చెప్పినట్లు వింటుంటారు. సెలవుల్లో విద్యార్థులు ఎక్కడపడితే అక్కడ తిరుగుతూ వంకలు, బావుల్లో ఈతకు వెళ్లి పందేలు వేసుకొని ఎవరూ ఎక్కువ ఈత కొడతారో వారే గెలిచినట్లు చేస్తుంటారు. తల్లిదండ్రులు ఇవన్నీ గమనించి విద్యార్థులను ఈనెల రోజులు మంచి మాటలతో మీ దగ్గరే ఉండేలా చూసుకునే బాధ్యత తల్లిదండ్రులపై ఉంది.

మలేరియాపై అప్రమత్తత అవసరం

- డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ సత్యవతి

ప్రజాశక్తి - ఆదోని

మాట్లాడుతున్న డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ సత్యవతి

గోనెగండ్లలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

హొళగుందలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని దోమలు వృద్ధి చెందకుండా జాగ్రత్తలు తీసుకొని మలేరియా సోకకుండా అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ సత్యవతి తెలిపారు. శుక్రవారం ప్రపంచ మలేరియా నివారణ దినోత్సవం సందర్భంగా మలేరియాను నిర్మూలించాలని ప్రభుత్వాస్పత్రి నుంచి మున్సిపల్ రోడ్డు వరకు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. మలేరియా, డెంగీ, చికున్ గున్యా, మెదడువాపు, బోదకాలు, జీకా వైరస్ తదితర వ్యాధుల బారిన పడకుండా దోమ తెర ద్వారా రక్షణ పొందాలని సూచించారు. హెల్త్ సూపర్‌వైజర్లు మంజునాథ, సీతారాముడు, మేరీ, అరుణ, జ్ఞానేశ్వరి, ధోరతి ఉన్నారు. **గోనెగండ్ల**లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు, సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ప్రజలకు మలేరియా వ్యాధి గురించి అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఆవరణలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, దోమతెరలను తప్పనిసరిగా వాడాలని సూచించారు. డాక్టర్ రజని, డాక్టర్ కార్తీక్ పాల్గొన్నారు. **హొళగుంద** ప్రభుత్వాస్పత్రిలో వైద్యులు డాక్టర్ న్యూటన్, రాధా ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు.

27న వాల్మీకి ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం

- వాల్మీకి ఉద్యోగ సంఘం నాయకులు

ప్రజాశక్తి - ఆదోని

మాట్లాడుతున్న నాయకులు

కర్నూలు జిల్లా వాల్మీకి ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని ఆదోని వాల్మీకి ఉద్యోగ సంఘ నాయకులు లక్ష్మి కాంత్, రమేష్ నాయుడు కోరారు. శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కర్నూలు మండల ప్రజా పరిషత్ సమావేశ ప్రాంగణంలో ఈ నెల 27న ఉదయం సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ప్రయివేట్ రంగాల్లో, విభాగాల్లో పనిచేస్తున్న వాల్మీకి/బోయ ఉద్యోగులందరూ ఈ ఆత్మీయ సమావేశానికి హాజరు కావాలని కోరారు. వాల్మీకి/బోయ విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు. జాతిలో ఉన్న నిరక్షరాస్యతను నిర్మూలించడానికి చర్యలు తీసుకుని అవగాహన కల్పించడం, అక్షరాస్యులైన వాల్మీకుల సర్వతోముఖాభివృద్ధి గురించి చర్చించి అభివృద్ధి కార్యక్రమాలను విస్తారంగా ప్రచారం చేసేందుకు పని చేయాల్సి ఉందని తెలిపారు. వాల్మీకి ఉద్యోగ నాయకులు నరసయ్య, సత్యన్న, సుధాకర్ బాబు, భీమరాజు, భాస్కర్ ఉన్నారు.